






చేర్యాలలోని వైశ్యభవన్‌లో వినాయకుడికి 201 రకాల నైవేద్యాలు నివేదిస్తున్న భక్తులు

మణిహారం

ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంతో మారనున్న గజ్వేల్ డివిజన్ దశదిశ

- ఐదు మండలాల గుండా ట్రిబుల్‌ఆర్
- జిల్లాలో 953 ఎకరాల భూసేకరణ
- ఏడాది చివరి నాటికి శంకుస్థాపనకు యోచన

భూముల మార్కెట్ విలువ పెంపు

జిల్లాలో ఆర్‌ఆర్‌ఆర్ వెళ్తున్న భూముల విలువలను ప్రభుత్వం రెట్టింపు చేసింది. రైతులకు నష్టం జరుగకుండా నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ క్రమంలోనే గజ్వేల్ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం పరిధిలోని రాయపోల్ మండలం బేగంపేట్‌లో ఎకరం భూమి విలువ రూ.2,62,500 ఉండగా రూ.5,82,750కి పెంచారు. ఎల్కల్‌లో ధర రూ.2,25,000 ఉండగా రూ.4,99,500లకు పెంచారు. గజ్వేల్ మండలం బంగ్లావెంకటాపూర్‌లో రూ.3,37,500 ఉండగా రూ.8,30,250కు పెంచారు. గజ్వేల్ మండలం మక్తామాసాన్‌పల్లిలో రూ.3,37,500 ఉండగా రూ.8,30,250కు పెంచారు. ముట్రాజ్‌పల్లిలో రూ.6,75,500 ఉండగా రూ.14,98,500 వరకు పెంచారు. ప్రజ్ఞాపూర్ పరిధిలో రూ.7,87,500 ఉండగా పలు సర్వే నంబర్లలో రూ.17,48,250.. మరికొన్ని సర్వే నంబర్లలో రూ.22,05,000 దాకా పెంచారు. వర్గల్ మండలం జబ్బాపూర్‌లో రూ.4,50,000 ఉండగా, రూ.8,32,500 లకు పెంచారు. ఇదే మండలం మైలారం గ్రామంలో రూ.5,25,000 ఉంటే దాన్ని రూ.9,71,250కు పెంచారు. నెంటూర్ పరిధిలో రూ.4,50,000 ఉండగా రూ.8,32,500లకు పెంచారు. భూమి విలువలు పెంచడంతో గతంలో ఎన్నడూ లేని విధంగా భూపరిహారంపై రైతులకు ఆశలు పెరిగాయి. కానీ చాలా వరకు రైతులు భూమికి భూమి ఇవ్వాలని కోరుతున్నారు. కాగా రైతులకు రూ.10లక్షల నుంచి రూ.25లక్షల వరకు గత పదేళ్ల మార్కెట్ విలువ ఆధారంగా నష్టపరిహారం దక్కనుంది.

గజ్వేల్, సెప్టెంబరు 11 : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్మించ తలపెట్టిన రీజనల్ రింగ్ రోడ్డు(ఆర్‌ఆర్‌ఆర్)తో సిద్దిపేట జిల్లాలోని గజ్వేల్ డివిజన్ దశదిశ మారనుంది. హైదరాబాద్ మహానగరానికి చేరువలో ఉన్న గజ్వేల్ డివిజన్‌కు ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణం మరో మణిహారం కానున్నది. ఔటర్ రింగ్ రోడ్డుకు 30 నుంచి 40 కిలోమీటర్ల దూరంలో రీజనల్ రింగ్ రోడ్డు నిర్మాణానికి గ్రీన్‌సిగ్నల్ వచ్చింది. మూడు అలైన్మెంట్లను పరిశీలించిన ప్రభుత్వం 158.6 కిలోమీటర్ల విస్తీర్ణం గల ఉత్తర భాగం రీజనల్ రింగ్ రోడ్డుకు అనుమతులిచ్చారు. గతంలో భారత్ మాల పరియోజన పథకం కింద ఆర్‌ఆర్‌ఆర్‌ను నిర్మించాలనుకోగా, దీనిని నిలిపివేసినందున ఎన్‌హెచ్‌ఏఐ ఆధ్వర్యంలో గ్రీన్‌ఫీల్డ్ హైవేగా అభివృద్ధి చేయనున్నారు. ఇప్పటికే గజ్వేల్‌లో పీడీ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి, ఆర్‌ఆర్‌ఆర్ ఉత్తరభాగానికి 161ఏఏ నంబర్‌ను కేటాయించింది.

17 గ్రామాల మీదుగా ..

గజ్వేల్ డివిజన్ పరిధిలోని రాయపోల్, వర్గల్, గజ్వేల్, మర్కుక్, జగదేవ్‌పూర్ మండలాల పరిధి నుంచి ఆర్‌ఆర్‌ఆర్ వెళ్లనుంది. ఐదు మండలాల పరిధిలో 17 గ్రామాల గుండా నిర్మించనున్నారు. దీనికి అవసరమైన 953 ఎకరాల భూమిని సేకరించనున్నారు. ఆర్‌ఆర్‌ఆర్ సంబంధించిన సర్వే పూర్తి చేసి, భూములు కోల్పోతున్న రైతులతో పలుమార్లు చర్చించారు. ఈ ఏడాది చివరినాటికి శంకుస్థాపన చేయాలని లక్ష్యంగా పెట్టుకొని ప్రభుత్వం పని చేస్తున్నది. ఒక్కసారి భూసేకరణ పూర్తయితే రెండు ఏళ్లలో రీజనల్ రింగ్ రోడ్డు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని నేషనల్ హైవే అథారిటీ అధికారులు చెబుతున్నారు.

గ్రీన్‌ఫీల్డ్ హైవే

గ్రీన్‌ఫీల్డ్ హైవే కావడంతో ఎక్కడైనా కట్టడాలు, పరిశ్రమలు, ఏవైనా ఉంటే పొలాల గుండా, అడవుల గుండా రోడ్డు నిర్మాణాన్ని చేపట్టనున్నారు. ప్రజ్ఞాపూర్‌లో రాణే పరిశ్రమ రోడ్డుకు అడ్డంగా ఉండడంతో ఒక వైపు రింగును అడ్జస్ట్ చేసి నిర్మించనున్నారు. గజ్వేల్ అర్బన్‌పార్క్ గుండా నిర్మాణాన్ని చేపట్టనున్నారు. దీంతో అర్బన్‌పార్క్ రూపురేఖలను మార్చుకోనుంది. అర్బన్‌పార్కు భూములకు బదులుగా ములుగు జిల్లాలో అటవీశాఖకు ప్రభుత్వం భూమిని కేటాయించింది. గతంలో మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు కేటాయించిన ప్లాట్ల నుంచి ఆర్‌ఆర్‌ఆర్ అలైన్‌మెంట్ వెళ్లడంతో ఆ ప్లాట్లను అధికారులు రద్దు చేశారు. జిల్లాలో రాజీవ్ రహదారి, చిట్యాల-సంగారెడ్డి మార్గం, మనోహరాబాద్-గజ్వేల్ రైల్వే మార్గం తగలనున్నాయి. వీటి పరిధిలో క్రాసింగ్(ఆర్వోబీ, ఆర్‌యూబీ)లను ఏర్పాటు చేయనున్నారు. సర్వీస్ రోడ్డు లేకుండా నిర్మాణాన్ని చేపట్టనున్నట్లు తెలిసింది.

రియల్ రంగానికి ఊతం

కొన్నాళ్లుగా ఒడిదుడుకులను ఎదుర్కొంటున్న రియల్ ఎస్టేట్ రంగం ఆర్‌ఆర్‌ఆర్ నిర్మాణంతో ఊపు అందుకోనుంది. గజ్వేల్ డివిజన్ పరిధిలో భూమి ధరలకు రెక్కలు రానున్నాయి. ఈ ప్రాంతంలో వ్యవసాయ, పరిశ్రమ రంగాలకు అనువుగా రోడ్డు, రైలుమార్గాలు అందుబాటులో ఉండనున్నాయి. దీంతో పరిశ్రమలు భారీగా ఏర్పాటు అయ్యే అవకాశాలు ఉన్నాయి. నియోజకవర్గంలోని మనోహరాబాద్, కర్కపట్లలలో ఇప్పటికే ఇండస్ట్రియల్ సెజ్‌లు ఉండగా, ములుగు మండలం సీడ్స్‌హబ్‌గా వర్ధిల్లుతుంది. మర్కుక్ మండలంలో కావేరి పరిశ్రమతో పాటు, వర్గల్ మండలంలో డూపాయింట్ లాంటి భారీ పరిశ్రమలు ఉన్నాయి. ఆర్‌ఆర్‌ఆర్ రాకతో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు అయ్యే అవకాశాలు ఉన్నాయని పలువురు భావిస్తున్నారు.



రీజనల్ రింగ్ రోడ్డు ఉత్తరభాగం అలైన్‌మెంట్

లంబోదరుడికి మహా నైవేద్యం

చేర్యాల, సెప్టెంబరు 11 : వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని వైశ్యభవన్‌లో బుధవారం మహాగణపతికి మహా నైవేద్యాన్ని నివేదించారు. ఈ సందర్భంగా మహిళలు భక్తిప్రపత్తులతో 201 రకాల నైవేద్యాలను తయారు చేశారు. శాస్త్రోక్తంగా గణనాథుడికి పూజలు నిర్వహించిన అనంతరం ప్రసాదాలను నివేదించారు.

లోన్ కట్టమని డబ్బులిస్తే.. స్వాహా

7

మహిళా గ్రూపు డబ్బులు కాజేసిన గ్రూప్ లీడర్ భర్త

సభ్యులు నిలదీయడంతో దంపతుల మధ్య గొడవ

లీడర్‌పై భర్త దాడి.. అడ్డుకుని చెట్టుకు కట్టేసిన సభ్యులు

పరస్పరం పోలీసులకు ఫిర్యాదు.. కేసు నమోదు

బ్యాంకు ఎదుట సంఘం సభ్యుల ఆందోళన

గంజాయి రవాణా చేస్తున్న నలుగురి అరెస్టు

7

పరారీలో మరో నలుగురు

మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందించాలి

- కలెక్టర్ మను చౌదరి



కొండపాక అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లల ఆటపాటలను చూస్తు ఆనందం వ్యక్తం చేస్తున్న కలెక్టర్ మనుచౌదరి

కొండపాక/కుకునూరుపల్లి, సెప్టెంబరు 11 : పిల్లలు మానసికంగా ఆరోగ్యంగా చురుగ్గా ఎదగాలంటే మెనూ ప్రకారం పౌష్టికాహారాన్ని అందివ్వాలని కలెక్టర్ మనుచౌదరి తెలిపారు. కొండపాక మండలం మర్పడగ ఎస్సీ కాలనీలో, కుకునూరుపల్లి, మెదినీపూర్‌లో అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన బుధవారం తనిఖీ చేశారు. చిన్నారులు, బాలింతలు గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని పరిశీలించారు. ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ ముఖ్యమైనదని, పిల్లలకు అర్థమయ్యే రీతిలో బోధించాలని సిబ్బందికి సూచించారు. కొండాపూర్ సెంటర్‌లో చిన్నారులు పాడుతూ, డ్యాన్స్ చేస్తూ రైమ్స్‌ను చెప్పడాన్ని చూసి కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. ఆయన వెంట జిల్లా ఇన్‌చార్జి సంక్షేమ అధికారి ఎల్లయ్య, సీడీపీవో రమాదేవి, కొండపాక, కుకునూరుపల్లి తహసీల్దార్‌లు దిలీప్, మల్లికార్జున్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ఆర్అండ్ఆర్ కాలనీల పూర్తి వివరాలను అందించాలి

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 11: ఆర్అండ్ఆర్ కాలనీల పూర్తి వివరాలను అందించాలని కలెక్టర్ మనుచౌదరి రెవెన్యూ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. సిద్దిపేట, గజ్వేల్ డివిజన్‌లలోని ఆర్అండ్ఆర్ కాలనీలలో సౌకర్యాలు, ఆయా కాలనీలలో ఉంటున్న వారి వివరాలపై ఆయన సమీక్షించారు. కాలనీల్లో చేపట్టిన తాగునీరు, విద్యుత్తు, డ్రైనేజ్, హెల్త్‌సెంటర్, పాఠశాలలు, వైకుంఠధామాలు పూర్తి స్థాయిలో పనిచేయాలని, సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి, గజ్వేల్, సిద్దిపేట ఆర్డీవోలు బన్సీలాల్, సదానందం, పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, ఈడబ్ల్యూఐడీసీ, ఇంజనీరింగ్ అధికారులు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పోషణ మాసం.. ఆరోగ్య రక్షణే లక్ష్యం

- జిల్లాలో కొనసాగుతున్న పోషణ మాసోత్సవాలు

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 11 : ఆరోగ్యకర సమాజ నిర్మాణానికి ఈ నెలాఖరు వరకు ప్రభుత్వం పోషణ మాసం నిర్వహిస్తోంది. మాతా, శిశువులలో పౌష్టికాహార లోపం తలెత్తకుండా పోషణ్ అభియాన్ కార్యక్రమంలో అందరినీ భాగస్వామ్యం చేసి అవగాహన కల్పిస్తున్నారు. విద్యా, వైద్యం, పంచాయతీరాజ్ శాఖల సహకారంతో రోజుకొక కార్యక్రమాన్ని సెప్టెంబర్ 30 వరకు నిర్వహిస్తారు. పిల్లలకు ఆట పాటలు, మాతృ పోషణ, తక్కువ బరువు, ఎత్తు, పౌష్టికాహార లోపం ఉన్న పిల్లల ఇళ్ల వద్దకు వెళ్లడం వంటి కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. పోషకాహార లోపంతో ఉన్న గర్భిణులు, బాలింతలను గుర్తించి పౌష్టికాహారం అందిస్తారు. ఇప్పటికే అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా బాలామృతం, బాలామృతం ప్లస్ అందజేస్తున్నారు. గుర్తించిన వారికి తగిన వైద్యం అందేలా చూడటంతోపాటు ఆరోగ్యంగా ఉండేందుకు కౌన్సెలింగ్ ఇస్తున్నారు. రక్తహీనత, పర్యావరణ పరిరక్షణ, వ్యక్తిగత పరిశుభ్రత వంటి అంశాలపై అవగాహన కార్యక్రమాలు చేపడతున్నారు.

ఐదు ప్రాజెక్టుల పరిధిలో..

జిల్లాలో సిద్దిపేట, హుస్నాబాద్, చేర్యాల, గజ్వేల్, దుబ్బాకలో ఐసీడీఎస్ ప్రాజెక్టులు ఉన్నాయి. వీటి పరిధిలో 1150 అంగన్‌వాడీ కేంద్రాలు, 5,880 మంది గర్భిణులు, 4,953 మంది బాలింతలు ఉన్నారు. ఆయా అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 6 నెలల నుంచి ఏడాదిలోపు 7,027 మంది చిన్నారులు, ఏడాది నుంచి మూడేళ్ల లోపు 25,503 మంది పిల్లలు ఉన్నారు. 3 నుంచి 6 ఏళ్లలోపు పిల్లలు 15,359 మంది ఉన్నారు.



రామంచలోని అంగన్‌వాడీ కేంద్రంలో పౌష్టికాహారంపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

ఆహారంపై అవగాహన కల్పిస్తున్నాం

పోషకాహారం ఆరోగ్యవంతమైన జీవనానికి ఎంతగానో ఉపయోగపడుతుంది. ప్రధానంగా ఇంటి పరిసరాల్లో లభించే ఆకుకూరలు, కూరగాయలు, సీజనల్ పండ్లతో తక్కువ ఖర్చుతో ఎక్కువ పోషకాలు లభిస్తాయి. శిశువు ఎదుగుదల, బరువు విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను తల్లిదండ్రులకు వివరిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందించే ఆహారంతోపాటు ఇంటి వద్ద పెట్టాల్సిన ఆహారంపై అవగాహన కల్పిస్తున్నాం.

- శారద, జిల్లా సంక్షేమ అధికారి


వినాయక నిమజ్జనానికి ఏర్పాట్లు

- కోమటిచెరువు, ఎర్రచెరువును పరిశీలించిన అధికారులు
- శోభాయాత్ర రూట్ మ్యాప్‌ల పరిశీలన

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 11 : గణనాథులు గంగమ్మ ఒడి చేరడానికి మరికొద్ది రోజులే మిగిలి ఉన్నాయి. సిద్దిపేటలో వినాయక నిమజ్జనానికి పోలీసు, మున్సిపల్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. బుధవారం సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధ, మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్ కోమటి చెరువు, ఎర్రచెరువును పరిశీలించారు. నిమజ్జన రూట్ మ్యాప్‌ను పరిశీలించారు. సీపీ మాట్లాడుతూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని, చెరువుల వద్ద బారికేడ్‌లను ఏర్పాటు చేయాలని సూచించారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలన్నారు. పార్కింగ్ ప్రదేశాల్లోనే వాహనాలు నిలిపేలా చూడాలని, వావానాల ఎంట్రీ, ఎగ్జిట్ పాయింట్ కనపడేవిధంగా ప్లెక్సీలు ఏర్పాటు చేయాలని, లైటింగ్ ఏర్పాటుచేయాలని ఆదేశించారు. నిమజ్జన ప్రాంతాల్లో సీసీ కెమెరాలను అమర్చాలని సూచించారు.



కోమటిచెరువు వద్ద ఏర్పాట్లను పరిశీలిస్తున్న సీపీ అనురాధ, తదితరులు



జియో ట్యాగింగ్‌తో శోభాయాత్ర పర్యవేక్షణ

జిల్లా వ్యాప్తంగా 2,989 మండపాలకు జియో ట్యాగింగ్ చేసినట్లు అధికారులు తెలిపారు. వర్డ లేబుల్ మ్యాపింగ్ ద్వారా నిమజ్జనానికి వెళ్లేటప్పుడు ఏ రూట్‌లో వెళ్తున్నారు.. ఎక్కడి వరకు వచ్చారు.. పోలీసు కంట్రోల్ రూమ్ నుంచి అధికారులు పర్యవేక్షించనున్నారు. ఊరేగింపులో వాహనం ఆగిపోతే పోలీసులు స్పందించి వెంటనే ఆ ప్రదేశానికి చేరుకోనున్నారు. జిల్లాలో ఆదివారం నుంచి మూడురోజుల పాటు నిమజ్జనాలు కొనసాగుతాయి. ఆదివారం 443, సోమవారం 427, మంగళవారం 1967 వినాయక ప్రతిమలను నిమజ్జనం చేయనున్నారు.

చేర్యాలలో ఏర్పాట్లు పరిశీలించిన అధికారులు

చేర్యాల, సెప్టెంబరు 11 : చేర్యాల పట్టణంలోని కుడిచెరువు వద్ద చేపడుతున్న గణేష్ నిమజ్జన ఏర్పాట్లను బుధవారం పోలీసు, రెవెన్యూ మున్సిపల్ అధికారులు సమీక్షించారు. ఈ సందర్భంగా చేర్యాల తహసీల్దారు సమీర్ అహ్మద్‌ఖాన్, మున్సిపల్ కమీషనర్ నాగేందర్, చైర్‌పర్సన్ అంకుగారి స్వరూపారాణి, సీఐ శ్రీను తదితరులు కుడిచెరువును సందర్శించారు. చెరువు కట్టపై బారీకేడ్‌లు, లైటింగ్, వాహనాల పార్కింగ్, ఇతరత్రా ఏర్పాట్లపై చర్చించారు.

జూలైలో అదృశ్యమై.. బావిలో శవమై

కుళ్లిన స్థితిలో వృద్ధురాలి మృతదేహం లభ్యం

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు

7



బ్రేకర్ల మోతలు



హుస్నాబాద్ పట్టణ ప్రధాన రహదారి బుధవారం డ్రిల్లింగ్ చేసే బ్రేకర్ల మోతలు, గన్నుల శబ్దాలతో హోరెత్తింది. ఎటు చూసినా కిలోమీటరు పొడవున ఉన్న వ్యాపార, నివాస భవనాల ముందు భాగాలను తొలగించిన దృశ్యాలే కనిపించాయి. ఎల్కతుర్తి- మెదక్ జాతీయ రహదారి నిర్మాణ(765 డీజీ) పనుల్లో భాగంగా ప్రధాన రహదారికి ఇరువైపుల ఉన్న వ్యాపార సముదాయాల ముందు భాగాలను మంగళవారం అధికారులు ఆకస్మికంగా కూల్చివేతకు పూనుకోవడంతో ఇక తప్పేట్లు లేదని దుకాణాల యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకున్నారు. దాదాపు 400 భవనాల భాగాలను తొలగించుకోవాల్సిన పరిస్థితి రావడంతో పనులు చేయడానికి చుట్టు పక్కల కూలీలు పెద్దఎత్తున వచ్చారు. డ్రిల్లింగ్ మిషన్(బ్రేకర్)తో తొలగించేందుకు ఫీట్‌కు రూ.400 వరకు, ఒక్కో భవనం ముందు బాల్కనీలను తొలగింపునకు రూ.5 వేల వరకు తీసుకున్నారు.

- హుస్నాబాద్, సెప్టెంబరు 11

రైల్వే గేటు మూసివేస్తే ఊరుకోం

● రైల్వే అధికారులను హెచ్చరించిన నాగిరెడ్డిపల్లి రైతులు



రైల్వే గేటు మూసేయొద్దని అధికారులను కోరుతున్న నాగిరెడ్డిపల్లి గ్రామ రైతులు, ప్రజలు

కోహీర్, సెప్టెంబరు 11: నాగిరెడ్డిపల్లి గ్రామ శివారులోని 20 నంబరు రైల్వేగేట్‌ను మూసేస్తే ఊరుకునేది లేదని సంగారెడ్డి జిల్లా కోహీర్ మండలం నాగిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన పలువురు రైతులు, ప్రజలు రైల్వే అధికారులను హెచ్చరించారు. గ్రామ శివారులోని 20 నంబరు రైల్వే గేటును మూసివేసి అండర్ బ్రిడ్జి నిర్మిస్తామని రైల్వే అధికారులు ఇటీవల రెవెన్యూ అధికారులకు తెలిపారు. అయితే ఆ గ్రామ రైతుల, ప్రజల అభిప్రాయాలను తెలుసుకోవాలని రెవెన్యూ అధికారులు రైల్వే అధికారులకు సూచించారు. వారి అభిప్రాయాలను తెలుసుకునేందుకు బుధవారం రైల్వే గేటు వద్దకు వెళ్లారు. రైల్వేగేటును మూసివేయడం సరికాదని ప్రజలు, రైతులు అన్నారు. నాగిరెడ్డిపల్లికి చెందిన చాలామంది రైతుల భూములు రైల్వేగేటుకు అవతలి వైపు ఉండడమే కాకుండా బిలాల్‌పూర్, పైడిగుమ్మల్ మర్పల్లి, భూచన్‌పల్లితో పాటు రెండు తండాలకు వెళ్లేందుకు అనుకూలమైన మార్గం మధ్యన అండర్ బ్రిడ్జి నిర్మిస్తే రాకపోకలకు తీవ్రంగా ఇబ్బందులు ఎదురవుతాయన్నారు. అండర్ బ్రిడ్జి నిర్మిస్తే వర్షాకాలంలో నీళ్లు నిండి రాకపోకలు ఆగిపోతాయన్నారు. చాలామంది రైతులు ఇక్కడ భూముల్లో చెరకు, అల్లం, ఆలుగడ్డ తదితర పంటలు పండిస్తారు. వాటిని ఎగుమతి చేయాలంటే అనుకూలమైన మార్గం ఉండాలి తప్ప చిన్నపాటి అండర్ బ్రిడ్జి నిర్మిస్తే వాహనాల రాకపోకలు సాగవని చెప్పారు. రైతుల, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకొని రైల్వే అధికారులు అవసరమైతే రైల్వే వంతెన నిర్మించాలి తప్ప అండర్ బ్రిడ్జి నిర్మించొద్దన్నారు. ఒకవేళ అండర్ బ్రిడ్జి నిర్మించాలని నిశ్చయించుకుంటే ఊరుకోమని, ఈ విషయమై సౌత్ సెంట్రల్ రైల్వే, సికింద్రాబాద్ రైల్వే డివిజన్ వద్ద ధర్నా చేస్తామని వారు హెచ్చరించారు.

గీతం స్కాలర్ కొప్పుల సురేష్‌కు డాక్టరేట్



కొప్పుల సురేష్

పటాన్‌చెరు రూరల్, సెప్టెంబరు 11: గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం, హైదరాబాద్‌లోని రసాయనశాస్త్ర విభాగం పరిశోధక విద్యార్థి కొప్పుల సురేష్ డాక్టరేట్‌కు అర్హత సాధించారు. ఈ పరిశోధనకు మార్గదర్శనం వహిస్తున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్‌లోని రసాయన శాస్త్ర విభాగం ప్రొఫెసర్ ఎం.ఎస్.సురేంద్ర బాబు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు. 'యురేనియం, స్ట్రాంటియం, సీసీయంల తొలగింపు కోసం ఊట(స్థిరమైన లోహ, సేంద్రియ (ఫ్రేమ్ వర్క్), వాటి మిశ్రమాల సంశ్లేషణ, లక్షణం' అనే అంశంపై అధ్యయనం చేసి, సిద్ధాంత వ్యాసాన్ని సమర్పించారు. సురేష్ సమర్పించిన సిద్ధాంత వ్యాసం పీహెచ్‌డీ పట్టాకు అర్హత సాధించడం పట్ల గీతం విశ్వవిద్యాలయం, హైదరాబాద్ అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావు, గీతం రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ సైన్స్ ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ మోతహర్ రెజా, రసాయనశాస్త్ర విభాగాధిపతి డాక్టర్ గౌసియాబేగం, సలు విభాగాల అధిపతులు, అధ్యాపకులు అభినందించారు.

ఐదుగురు పేకాట రాయుళ్ల అరెస్ట్

● శివ్వంపేట ఎస్ఐ మహిపాల్‌రెడ్డి

శివ్వంపేట, సెప్టెంబరు 11: వినాయక మండపంలో పేకాట ఆడుతున్న ఐదుగురిని పోలీసులు పట్టుకున్న ఘటన బుధవారం మెదక్ జిల్లా మండల కేంద్రమైన శివ్వంపేటలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రమైన శివ్వంపేటలోని ఓ వినాయక మండపంలో ఐదుగురు పేకాట ఆడుతున్నారని పోలీసులకు విశ్వసనీయ సమాచారం అందింది. దీంతో పేకాట స్థావరంపై దాడిచేసి రూ.41,500 నగదు, 52 కార్డ్స్‌ను స్వాధీనం చేసుకుని, ఐదుగురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మహిపాల్ రెడ్డి తెలిపారు.

మిషన్ భగీరథ కార్మికులకు
పెండింగ్ వేతనాలివ్వాలి

● సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు


మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

కంది, సెప్టెంబరు 11 : మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న జీతాలను వెంటనే చెల్లించాలని, లేకుంటే ఎస్ఈ కార్యాలయాన్ని ముట్టడిస్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సాయిలు హెచ్చరించారు. మంగళవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన 'మిషన్ భగీరథ.. కార్మికుల వ్యథ' అనే కథనానికి పలు ప్రజా సంఘాల నాయకులు స్పందించారు. ఈ మేరకు బుధవారం మండలపరిధిలోని కాశీపూర్‌లోని నీటి ట్యాంకు వద్ద మిషన్ భగీరథ కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా సాయిలు మాట్లాడుతూ పది నెలలుగా జీతాలు రాక మిషన్ భగీరథ కార్మికులు దయనీయ పరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. రెండు రోజుల్లో పెండింగ్ వేతనాలు ఇవ్వకుంటే ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. సమావేశంలో మిషన్ భగీరథ కార్మికులు నర్సింహులు, శ్రీకాంత్, లక్ష్మణ్, యాదయ్య, సాయికుమార్, లింగం, సదానందనం, తదితరులు పాల్గొన్నారు.

యువకుడి మృతదేహం లభ్యం

పటాన్‌చెరు, సెప్టెంబరు 11: పిల్లర్ గుంతలో గుర్తుతెలియని యువకుడి మృతదేహం లభ్యమైన సంఘటన పటాన్‌చెరు పోలీస్ స్టేషన్ పరిధిలో బుధవారం చోటు చేసుకుంది. ఎస్ఐ అభిమాన్‌సింగ్ కథనం ప్రకారం ఇస్నాపూర్‌లోని ఓడీఎఫ్ కాలనీ పక్కన ఓ సంస్థ నిర్మిస్తున్న భవనం పిల్లర్ గుంతల వద్ద కూలీలు ఉదయం పని చేసేందుకు వెళ్లగా నీటిలో యువకుడి మృతదేహం కనిపించింది. సైట్ ఇన్‌చార్జి జయంత్‌రెడ్డి అందించిన సమాచారం మేరకు అక్కడికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని వెలికితీయించి పోస్టుమార్టం నిమిత్తం పటాన్‌చెరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతుడు నీలిరంగు జీన్స్ ప్యాంటు, నలుపురంగు ఫుల్ టీషర్ట్, నలుపు రంగు డ్రాయర్ ధరించి ఉన్నాడు. కుడి చేతిపై హిందీ అక్షరాలలో మా (షా) అని పచ్చబొట్టు ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

జూలైలో అదృశ్యమై.. బావిలో శవమై..

● కుళ్లిపోయిన స్థితిలో వృద్ధురాలి మృతదేహం లభ్యం
● అనుమానాస్పద మృతిగా కేసు నమోదు


నర్సమ్మ (ఫైల్)

మద్దూరు, సెప్టెంబరు 11 : మండలంలోని రేబర్తి గ్రామానికి చెందిన వృద్ధురాలు గొట్టపు నర్సమ్మ (80) అనుమానాస్పద మృతిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం గొట్టపు నర్సమ్మ గత జూలై 24న ఉదయం 6గంటలకు ఇంట్లో నుంచి బయటకెళ్లి తిరిగిరాలేదు. బంధుమిత్రుల వద్ద వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. ఈ క్రమంలో బుధవారం పొలం వద్దకు వెళ్లిన రైతు కోతులను కొట్టే క్రమంలో బావిలోకి తొంగి చూడగా కుళ్లిన శవం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని గొట్టపు నర్సమ్మ మృతదేహంగా గుర్తించారు. శవ పంచనామా నిర్వహించి కుటుంబానికి అప్పగించినట్లు ఎస్ఐ తెలిపారు.

నేడు ప్రాంతీయ స్థాయి యూత్ పార్లమెంట్

వర్గల్, సెప్టెంబరు 11 : వర్గల్ మండల కేంద్రంలోని కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో నడుపబడుతున్న జవహర్ నవోదయ విద్యాలయంలో గురువారం ప్రాంతీయ స్థాయి యూత్ పార్లమెంట్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రాజేందర్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, నవోదయ విద్యాలయ సమితి హైదరాబాద్ ప్రాంతీయ కార్యాలయ సహాయ సంచాలకుడు ఉమాపతిరెడ్డి హాజరవుతారని తెలిపారు. లోక్‌సభలో జరిగే కార్యకలాపాలను ప్రతిబింభించే విధంగా యూత్ పార్లమెంట్ పోటీ ఉంటుందని, ఇందులో 55 మంది విద్యార్థులు పాల్గొంటారని పేర్కొన్నారు.

14న సిద్దిపేట జిల్లా అథ్లెటిక్స్

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 11: సిద్దిపేట పట్టణంలోని మినీ స్టేడియంలో ఈ నెల 14న అథ్లెటిక్స్ ఎంపిక పోటీలు ఉంటాయని జిల్లా అథ్లెటిక్స్ సంఘం అధ్యక్షుడు గ్యాదరి పరమేశ్వర్, కార్యదర్శి కర్రోల్ల వెంకటస్వామిగౌడ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అండర్ 14, 16, 18, 20 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 100, 800, 3000 మీటర్ల పరుగుపందెం, లాంగ్ జంప్, హైజంప్, షాట్ పుట్, డిస్కస్ త్రో తదితర అంశాల్లో పోటీలు ఉంటాయని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు పుట్టిన ధృవపత్రం, పదవ తరగతి మెమో తీసుకొని ఈ నెల 13న సాయంత్రం 6 గంటల లోపు అథ్లెటిక్స్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు 8501977079, 9666020322, 9704061543 నంబర్లను సంప్రదించాలని పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 19, 20న హైదరబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీలో రాష్ట్ర స్థాయి జూనియర్ అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

గంజాయి రవాణా చేస్తున్న నలుగురి అరెస్టు

● పరారీలో మరో నలుగురు

సిద్దిపేట అర్బన్, సెప్టెంబరు 11 :గంజాయిని సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తులను అరెస్టు చేసిన సంఘటన బుధవారం సాయంత్రం సిద్దిపేట అర్బన్ మండలం పొన్నాల శివారులో చోటుచేసుకుంది. త్రీ టౌన్ సీఐ విద్యాసాగర్ కథనం ప్రకారం కొంతమంది గంజాయిని తీసుకొని పొన్నాల నుంచి సిద్దిపేటకు వెళ్తున్నారన్న సమాచారంతో సిద్దిపేట అర్బన్ మండలం ఇందూర్ కళాశాల వద్ద ఎస్ఐ చంద్రయ్య ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ తరుణంలో పోలీసులను చూసి బైకుపై పారిపోతున్న యువకులను పట్టుకొని తనఖీలు చేయగా గంజాయి లభించింది. ఈ ఘటనలో సిద్దిపేట అర్బన్ మండలం టీహెచ్‌ఆర్‌నగర్‌కు చెందిన నాచారం సాయికుమార్, పొన్నాల గ్రామానికి చెందిన కోటగళ్ల ఆదర్శ్, కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన తలారి రాకేశ్, కొండపాక మండలం దుద్దెడ గ్రామానికి చెందిన దయ్యాల శ్రీకాంత్‌లను అదుపులోకి తీసుకున్నారు. మరో నలుగురు చేర్యాల మండలం ముత్యాల గ్రామానికి చెందిన దండు రాజేష్, నంగునూరు మండలం రాంపూర్ గ్రామానికి చెందిన గంగుల గణేష్, సిద్దిపేట అర్బన్ మండలం మిట్టపల్లి గ్రామానికి చెందిన ప్రణయ్, కోహెడ మండలం జ్యోతిరావు తండాకు చెందిన భూక్య అనిల్ పరారీలో ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందితుల నుంచి 50 గ్రాముల గంజాయి, నాలుగు సెల్ ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నారు.

ఎడ్యుకేషన్ హబ్‌గా మెదక్

● వైద్య కళాశాల ఏర్పాటుతో స్థానికులకు గొప్ప అవకాశం
● నెరవేరనున్న పేద విద్యార్థుల కల
● ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు
● పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలి
● కలెక్టర్ రాహుల్‌రాజ్


కేక్ కట్ చేసి కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు తినిపిస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు

మెదక్/మెదక్ అర్బన్, సెప్టెంబరు 11: వైద్య కళాశాల ఏర్పాటుతో మెదక్ విద్యాహబ్‌గా మారుతోందని స్థానిక ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు అన్నారు. బుధవారం మెడికల్ కాలేజీకి నేషనల్ మెడికల్ కౌన్సిల్ అనుమతి ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పిల్లికొట్టాల్‌లోని తాత్కాలిక మెడికల్ కళాశాల భవనాన్ని ఆయన కలెక్టర్ రాహుల్‌రాజ్‌తో కలిసి పరిశీలించారు. అనంతరం కేక్ కట్ చేసి సంబురాలు జరుపుకున్నారు. ఎంసీహెచ్ పక్కన నిర్మించనున్న శాశ్వత మెడికల్ కాలేజీ భవన నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రోహిత్‌రావు మాట్లాడుతూ.. జిల్లా ప్రజల చిరకాల ఆకాంక్ష నెరవేరిందన్నారు. వైద్యకళాశాల ఏర్పాటుతో స్థానికులకు డాక్టరు కోర్సు చదివే గొప్ప అవకాశం దక్కుతుందని, పేద విద్యార్థుల కల సాకారం అవుతుందన్నారు. నర్సింగ్, మెడికల్ కళాశాల ఒకే ప్రాంగణంలో ఉండే విధంగా చూడాలని కలెక్టర్‌కు సూచించారు. జిల్లా అభివృద్ధికి ఎటువంటి సహాయ సహకారాలు కావాలన్నా అందిస్తానని స్పష్టం చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం భవన నిర్మాణలకు చర్యలు తీసుకుంటామన్నారు జిల్లాలోని యువత డాక్టర్లు ఇంజినీర్లుగా, ఐఏఎస్ అధికారులుగా ఎదుగాలని ఆకాంక్షించారు. ఎన్నో అవాంతరాల తర్వాత వైద్య కళాశాల మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కలెక్టర్, అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి..

కలెక్టర్ రాహుల్‌రాజ్ మాట్లాడుతూ అనుభవజ్ఞులైన వైద్యాధికారులు పేద ప్రజలకు మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించాలన్నారు. జిల్లా పునర్విభజనలో భాగంగా మెదక్ ప్రత్యేక జిల్లా కేంద్రం అయినా అంత అభివృద్ధి చెందలేదన్నారు. జిల్లా అభివృద్ధిలో విద్యా వైద్య సౌకర్యాలు మెరుగైన పాత్ర పోషిస్తాయన్నారు. అంతకముందు మెదక్ పట్టణంలో కాంగ్రెస్ శ్రేణులు రాందాస్ చౌరస్తాలో ముఖ్యమంత్రిరెడ్డి, ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్‌రావు చిత్రపటానికి క్షీరాభిషేకం చేసి, పటాకులు కాల్చి సంబురాలు చేసుకున్నారు. కార్యక్రమంలో మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ రవీందర్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. శివదయాల్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, కౌన్సిలర్లు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

పిన్న చెరువుకు గండి

● తూమును ధ్వంసం చేసిన గుర్తు తెలియని వ్యక్తులు
● వృధాగా నీరు.. ఖాళీ అవుతున్న చెరువు
● కన్నెత్తి చూడని ఇరిగేషన్ అధికారులు

సదాశివపేట, సెప్టెంబరు 11: సదాశివపేట పట్టణంలోని 65వ జాతీయ రహదారి పక్కనే మిషన్‌కాకతీయ పథకంలో అభివృద్ధి చేసిన పిన్న చెరువుకు కొందరు గుర్తు తెలియన వ్యక్తులు రాత్రికి రాత్రే గండి కొట్టారు. దీంతో చెరువులోని నీరంతా వృధాగా పోతున్నది. ఇది చూసిన రైతులు, మత్స్యకారులు లబోదిబోమంటున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పిన్న చెరువు నిండు కుండలా మారడంతో వెనకాల వెలసిన వెంచర్లల్లోని ప్లాట్లు నీటిలో మునిగి పోయాయి. దీంతో కొందరు రియల్టర్లు చెరువును ఖాళీ చేయాలనే ఉద్దేశంతో ఈ దారుణానికి ఒడిగట్టారని పలువురు ఆరోపిస్తున్నారు. చెరువు కట్ట కింది భాగంలో చెరువు తూమును గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేయడంతో చెరువులోని నీరు రైతుల భూములను ముంచెత్తుతున్నది. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో వెంచర్లు ఉండడం వల్లే వర్షాలు కురిసిన ప్రతిసారి అవి నీటి మునుగుతున్నాయి. దీంతో చెరువు నిండినప్పుడల్లా కొందరు రియల్టర్లు చెరువుకు గండి కొట్టడం అలవాటుగా మార్చుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇంత జరిగినా సంబంధిత ఇరిగేషన్ శాఖ అధికారులు ఇటు వైపుగా కన్నెత్తి చూడడం లేదని రైతులు, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు తీసుకోవాలి..



పిన్న చెరువు పై భాగంలో ఉన్న వెంచర్ల యజమానులే చెరువు నిండగానే ఎక్కకవేటర్లతో చెరువు తూమును, కట్టను ధ్వంసం చేస్తున్నారు. ఈ విషయంలో అధికారులు గట్టి చర్యలు తీసుకోవాలి. పట్టణంలో 100కు పైగా మత్స్యకార కుటుంబాలు ఉన్నాయి. పిన్న చెరువు, ఊబ చెరవు, కొత్త చెరువులపై ఆధారపడి బ్రతుకుతున్నాయి.

-హనుమంతు, మత్స్యకార సంఘం అధ్యక్షుడు


సదాశివపేట పట్టణంలోని పిన్న చెరువు, గండి పడడంతో వృథాగా పోతున్న నీరు..


హజ్రత్ మహ్మద్ ఫీర్ బాబాన్ షా వలీ దర్గా, పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సాహెబ్

16 నుంచి ఉర్సు

● మూడు రోజులపాటు సింగూరు శివారులోని దర్గాలో ఉత్సవాలు
● హాజరుకానున్న అన్నసాగర్ పీఠాధిపతి ఖలీల్ హుస్సేన్

పుల్‌కల్, సెప్టెంబరు 11: మండలంలోని సింగూరు గ్రామ శివారులో వెలసిన హజ్రత్ మహ్మద్ ఫీర్ బాబాన్ షా వలీ దాదా హజత్ 79వ ఉర్సు ఉత్సవాలు ఈ నెల 16 నుంచి ప్రారంభంకానున్నాయి. 16, 17, 18వ తేదీల్లో జరగనున్న ఈ ఉత్సవాలను అంగ రంగ వైభవంగా నిర్వహించేందుకు దర్గా పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సాహెబ్ ఆధ్వర్యంలో ఏర్పాట్లు జరుగుతున్నాయి. గత 79 సంవత్సరాలుగా ఏటా నిర్వహిస్తున్న ఉర్సుకు కుల, మతాలకతీతంగా వందలాది మంది ప్రజలు తరలివస్తుంటారు. ఉత్సవాలకు హాజరయ్యే ప్రజలు ఇబ్బందులకు గురికాకుండా నిర్వాహకులు అన్నీ వసతులను ఏర్పాటు చేస్తున్నారు. ఇప్పటికే దర్గాను రంగు రంగుల విద్యుత్ లైట్లతో అందంగా అలంకరించారు. దర్గా పీఠాదిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సాహెబ్ ఇంటి నుంచి ఎంతో పవిత్రత కలిగిన గంధం, చాదర్‌ను దర్గాలోకి తీసుకువెళ్లే ఘట్టాన్ని అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తారు. ఉర్సు ఉత్సవాలను పురస్కరించుకుని ప్రత్యేకంగా 17వ తేదీన ఉదయం కబడ్డీ, వాలీబాల్‌తో పాటు వివిధ క్రీడా పోటీలను నిర్వహించనున్నారు. అదే రోజు సాయంత్రం నాతే షై ఫీల్ సమ, అన్నదాన వితరణ కార్యక్రమాలు చేపడుతారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా అన్నసాగర్ పీఠాధిపతి హజ్రత్ సుఫీ షా మహ్మద్ ఖలీల్ హుస్సేన్ ఉర్ఫ్ జహీద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ హాజరుకానున్నారని దర్గా పీఠాధిపతి మహ్మద్ అబిద్ హుస్సేన్ సత్తరుల్ ఖాద్రీ సాహెబ్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

లోన్ కట్టమని డబ్బులిస్తే.. స్వాహా..

● మహిళా గ్రూపు డబ్బులు కాజేసిన గ్రూప్ లీడర్ భర్త
● సభ్యులు నిలదీయడంతో దంపతుల మధ్య గొడవ
● లీడర్‌పై భర్త దాడి.. అడ్డుకుని చెట్టుకు కట్టేసిన సభ్యులు
● పరస్పరం పోలీసులకు ఫిర్యాదు.. కేసుల నమోదు
● బ్యాంకు ఎదుట మహిళా సంఘం సభ్యుల ఆందోళన

తూప్రాన్, సెప్టెంబరు 11: మహిళా సంఘం డబ్బులను ఆ గ్రూపు నాయకురాలి భర్త కాజేసిన ఘటన పడాలపల్లిలో చోటు చేసుకున్నది. తూప్రాన్ ఎస్ఐ శివానందం, గ్రామస్తుల కథనం ప్రకారం తూప్రాన్ పట్టణ పరిధి పడాలపల్లిలోని అంబేద్కర్ మహిళా సంఘంలో సభ్యులు తూప్రాన్ ఎస్‌బీఐ బ్యాంకులో రూ.10 లక్షల రుణాలు తీసుకున్నారు. దీనికి సంబంధించిన నెలనెలా వాయిదాలు, పొదుపు డబ్బులను 11 నెలలుగా గ్రూపు నాయకురాలు కానుకుంట మున్ని మినీకి చెల్లిస్తున్నారు. ఈ డబ్బులను ఆమె భర్త బ్యాంకుకు చెల్లించకుండా సొంతానికి వాడుకుంటూ వస్తున్నాడు. దాంతో బ్యాంకు అధికారులు పొదుపు డబ్బుల నుంచి వడ్డీ డ్రా చేసి ఖాతాకు జమా చేయడం గుర్తించిన గ్రూపు సభ్యులు ఈ విషయమై మున్నిని కొద్దిరోజుల క్రితం నిలదీశారు. దీంతో ఈ నెల 10న మొత్తం డబ్బులు చెల్లిస్తానంటూ చెప్పిన ఆమె అప్పటి నుంచి కనిపించకుండా పోయింది. దీంతో మహిళలు మున్ని భర్త కానుకుంట భిక్షపతిని నిలదీశారు. కాగా, మంగళవారం రాత్రి మున్ని వచ్చిందని తెలుసుకున్న మహిళలందరూ ఆమె ఇంటికి వెళ్లి డబ్బులు అడగగా.. డబ్బులు వాడుకున్న విషయంలో భార్యాభర్తల మధ్య గొడవ జరిగింది. ఈ ఘర్షణలో భర్త మున్నిపై దాడికి యత్నించగా సంఘం సభ్యులు అడ్డుకుని భిక్షపతిని చెట్టుకు తాడుతో కట్టేశారు. మొత్తం రూ.6,62,610 కాజేసినట్లుగా గ్రూపు సభ్యులు గుర్తించి బుధవారం బ్యాంకు మేనేజర్‌కు ఫిర్యాదు చేయడంతోపాటు న్యాయం చేయాలని కోరుతూ బ్యాంకు ఎదుట ఆందోళన చేపట్టారు. కాగా చెట్టుకు కట్టేయడంపై లీడర్ భర్త భిక్షపతి పోలీసులకు ఫిర్యాదు చేయగా.. రుణాల వాయిదా చెల్లింపు డబ్బులు కాజేశారని మహిళా గ్రూపు సభ్యులు ఆయనపై ఫిర్యాదు చేశారు. ఈ మేరకు భిక్షపతిపై, మహిళా గ్రూపు సభ్యులపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ శివానందం తెలిపారు.


ఆందోళన చేస్తున్న గ్రూపు సభ్యులు

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక


రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైన గట్లమల్యాల పాఠశాల విద్యార్థులు

నంగునూరు, సెప్టెంబరు 11 : రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు నంగునూరు మండలం గట్లమల్యాల పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్ఎం రమేశ్ తెలిపారు. జిల్లాస్థాయిలో జరిగిన పోటీల్లో పాల్గొన్న ఈశ్వరి, అను, వైష్ణవి, రోహిత్ ఉత్తమ ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 21, 22, 23 తేదీలలో సిరిసిల్లలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో వారు పాల్గొంటారన్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు రాజ్‌కుమార్‌ను హెచ్ఎం అభినందించారు. ఎంపికైన విద్యార్థులను ఆప్ కమిటీ చైర్మన్ సరోజన, ఉపాధ్యాయులు అభినందించారు.

నారాయణరావుపేట ఉన్నత పాఠశాల విద్యార్థి..

సిద్దిపేట రూరల్, సెప్టెంబరు 11: జిల్లాస్థాయి జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నారాయణరావుపే ఉన్నత పాఠశాల విద్యార్థి కమలాకర్ రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు హెచ్ఎం వడ్డెపల్లి నాగరాజు బుధవారం తెలిపారు. ఎంపికైన విద్యారిని పలువురు అభినందించారు.

ఖోఖో పోటీలకు రాయపోల్ విద్యార్థి..


సుశాంత్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

రాయపోల్, సెప్టెంబరు 11: రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు రాయపోల్ ఉన్నత పాఠశాల విద్యార్థి సుశాంత్ ఎంపికయ్యాడు. ఈ నెల 9న తూప్రాన్‌లో జరిగిన పోటీల్లో సుశాంత్ ఉత్తమ ప్రతిభ కనబర్చడంతో ఎంపిక చేశారు. ఈ నెల 13 నుంచి 15 వరకు హైదరాబాద్‌లో జరిగే రాష్ట్ర స్థాయి పోటీలలో ఉమ్మడి మెదక్ జిల్లా జట్టులో పాల్గొంటాడని పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ గోవర్ధన్‌రెడ్డి తెలిపారు. సుశాంత్‌ను హెచ్ఎం నాగరాజు అభినందించారు.

రేషన్ బియ్యం పట్టివేత

అల్లాదుర్గం/చిన్నకోడూరు/తొగుట, సెప్టెంబరు 11: అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకుని కేసు నమోదు చేశామని అల్లాదుర్గం ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి తెలిపారు. అల్లాదుర్గం ఐబీ చౌరస్తా సమీపంలో బుధవారం వాహనాలు తనిఖీ చేస్తున్న క్రమంలో సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నుంచి కామారెడ్డి జిల్లా పిట్లంనకు ఓ బొలెరో వాహనంలో 3.5 టన్నుల రేషన్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. దీంతో వాహనాన్ని సీజ్‌చేసి, నారాయణఖేడ్‌కు చెందిన డ్రైవర్ కదావత్ శ్రీనుపై కేసు నమోదు చేశామన్నారు. పట్టుబడిన రేషన్ బియ్యాన్ని పెద్దశంకరంపేటలోని పౌర సరఫరాల గోదాంలో నిల్వ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. అక్రమంగా నిల్వచేసిన 10 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ బాలకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం చిన్నకోడూరు మండలంలోని ఇబ్రహీంనగర్‌లో ఓ ఇంట్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా నిల్వచేశారనే నమ్మదగిన సమాచారంపై మంగళవారం సాయంత్రం సిద్దిపేట టాస్క్‌ఫోర్స్, చిన్నకోడూరు పోలీసులు సంయుక్తంగా వెళ్లి దాడి చేశారు. అక్రమంగా నిల్వచేసిన 10 క్వింటాళ్ల రేషన్‌బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. బియ్యాన్ని నిల్వచేసిన అదే గ్రామానికి చెందిన ఉప్పలయ్య, కనకయ్య, బాలయ్యపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే తొగుట మండలం ఘనపూర్ గ్రామశివారులో మోపెడ్‌పై పల్లెపహాడ్ గ్రామానికి చెందిన గుగులోత్ రాజు అక్రమంగా తరలిస్తున్న క్వింటాల్ 20 కిలోల రేషన్ బియ్యాన్ని పట్టుకుని సీజ్ చేసినట్లు తొగుట రెవెన్యూ అధికారి అశోక్‌రాజ్ తెలిపారు.

నాసిరకం రేషన్‌బియ్యంపై విచారణ

అల్లాదుర్గం, సెప్టెంబరు 11: నాసిరకం బియ్యం మాకొద్దంటూ మెదక్ జిల్లా అల్లాదుర్గం మండలం రాంపూర్ గ్రామస్థులు తిరస్కరించిన విషయం తెలిసిందే. ఈ విషయమై పౌర సరఫరాల జిల్లా అధికారి సురేష్‌రెడ్డి బుధవారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు రేషన్ వినియోగదారులు అధికారుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో కొంతసేపు ఉద్రిక్తత నెలకొన్నది. పెద్దశంకరంపేటలోని పౌర సరఫరాల గోదాం ఇన్‌చార్జి తీరుతోనే దుమ్ము, ధూళి పట్టిన బియ్యం గ్రామాలకు సరఫరా అవుతున్నాయని డీఎస్‌వోకు విన్నవించారు. అలాగే ఈ విషయాన్ని జిల్లా అధికారులకు కూడా ఫోన్ ద్వారా ఫిర్యాదు చేశారు.

తుమ్మ గాలయ్య మృతి బాధాకరం

● మాజీ మంత్రి హరీశ్‌రావు


గాలయ్య(ఫైల్)

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు 11: సిద్దిపేట చేనేత కురు వృద్ధుడు తుమ్మ గాలయ్య మృతి బాధాకరమని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు అన్నారు. గాలయ్య మృతిపై సంతాపం వ్యక్తం చేసి మాట్లాడారు. ప్రస్తుతం ప్రాచుర్యంలో ఉన్న గొల్లభామ చీరలు అత్యధికంగా తయారు చేస్తున్న వ్యక్తిగా, మాస్టర్ వీవర్‌గా పేరు తెచ్చుకున్న వ్యక్తి గాలయ్య అని గుర్తుచేశారు. కనుమరుగైన పట్టు పీతంబరాన్ని ఈ ఆధునిక ప్రపంచానికి కూడా పరిచయం చేశారని, పట్టుపితంబరాలు తయారు చేయడంలో దిట్ట అని, వీరి వద్ద ఎంతోమంది చేనేత వృత్తిని నేర్చుకున్నారని తెలిపారు. ప్రస్తుతం గాలయ్య దగ్గర 25 మంది చేనేత వృత్తి కళాకారులు ఉపాధి పొందుతున్నారన్నారు. భారతదేశంలో ఎక్కడ చేనేత ఎగ్జిబిషన్ జరిగినా సిద్దిపేట గాలయ్య స్టాల్ ఉంటుందని చెప్పారు. గొల్లభామలో పట్టుచీరలు టై అండ్ మస్రరైజ్డ్ చీరలు, పటోళ్ల చీరలు, పోచంపల్లి చీరలు తయారు చేయడంలో చాలా నైపుణ్యం కలవారని కొనియాడారు. ఆయన మృతి చేనేత కళారంగానికి తీరని లోటని, వారి కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

ప్రజల్లో కాంగ్రెస్‌కు విశ్వసనీయత లేదు

● 1.2 లక్షల బీజేపీ సభ్యత్వాలే లక్ష్యంగా ముందుకు సాగాలి
● బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు


మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌బాబు

మెదక్ అర్బన్, సెప్టెంబరు 11: ప్రజల్లో కాంగ్రెస్ సర్కార్ విశ్వసనీయతను కోల్పోయిందని సిర్పూర్ బీజేపీ ఎమ్మెల్యే పాల్వాయి హరీశ్‌బాబు ఆరోపించారు. బుధవారం స్థానిక టీఎన్జీవో భవన్‌లో ఏర్పాటుచేసిన సభ్యత్వ నమోదును ఆయన ప్రారంభించి మాట్లాడారు. పండుగలా సభ్యత్వ నమోదు చేపట్టాలన్నారు. జిల్లాలోని రెండు నియోజకవర్గాల్లో 1,20,000 సభ్యత్వ నమోదును లక్ష్యంగా పెట్టుకుని ముందుకు సాగాలని సూచించారు. దేశ వ్యాప్తంగా పకడ్బందీగా సభ్యత్వ నమోదు చేపట్టిన పార్టీ బీజేపీ అన్నారు. ప్రతీఒక్కరు బీజేపీ సభ్యత్వం తీసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, అలాంటి వారి వద్దకెళ్లి అడగాల్సిన బాధ్యత మనపై ఉన్నదన్నారు. నవంబరు 10 వరకు దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలు, జిల్లాల్లో సభ్యత్వ నమోదు పూర్తిచేసుకుని జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే కార్యక్రమం మొదలవుతుందన్నారు.

నీట మునిగిన పంటల పరిశీలన

కోహీర్, సెప్టెంబరు 11: ఇటీవల కోహీర్ మండలంలో కురిసిన భారీ వర్షాలకు నీట మునిగి పాడైన పంటలను జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శివప్రసాద్ బుధవారం పరిశీలించి మాట్లాడారు. కోహీర్‌లోని నారింజ పరీవాహక ప్రాంతంలో నీట మునిగి పాడైన మినుము, పెసర కంది తదితర పంటలను పరిశీలించామన్నారు. నారింజ పరీవాహక ప్రాంతంలో అధికంగా నల్లరేగడి భూమి ఉండడం వల్ల చాలామంది రైతులు చిరుధాన్యాల పంటలైన మినుము, పెసర, కంది సాగుచేసినట్లు తెలిపారు. భారీ వర్షాలతో నారింజ నిండుగా పారడంతో సమీప ప్రాంతంలో ఉన్న పంటలు నీట మునిగాయన్నారు. పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిస్తామని పేర్కొన్నారు. అంతకుముందు మండలంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఆయన పరిశీలించారు. ఫర్టిలైజర్ దుకాణదారులు నిబంధనల ప్రకారం ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల అమ్మకాలు జరపాలన్నారు. అలాగే అన్ని రికార్డులను నమోదు చేయాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట మండల వ్యవసాయ అధికారి నవీన్‌కుమార్, ఏడీఏ ఉన్నారు.

కుల బహిష్కరణ ఘటనపై స్పందన

● కలెక్టర్, ఎస్పీ ఆదేశాలతో గ్రామస్థులకు అధికారుల కౌన్సెలింగ్


గ్రామస్థులకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న అధికారులు

మనోహరాబాద్, సెప్టెంబరు 11: గ్రామంలో శుభ, అశుభ కార్యాలకు డప్పు కొట్టడం లేదని గౌతోజిగూడకు చెందిన పంచమి నరసమ్మ, ఈమె కుమారులు అర్జున్, చంద్రం కుటుంబాన్ని కుల బహిష్కరణ చేయడంతో పాటు గ్రామస్థులు మాట్లాడితే జరిమానా విధిస్తామని తీర్మానించారు. దీంతో బాధితులు ట్విట్టర్‌లో మెదక్ ఎస్పీకి మంగళవారం ఫిర్యాదు చేసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అయితే కలెక్టర్, ఎస్పీ ఆదేశాల మేరకు తూప్రాన్ సీఐ రంగకృష్ణ, తహసీల్దార్ చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎస్ఐ సుభాష్‌గౌడ్ బుధవారం గ్రామస్థులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ రంగకృష్ణ మాట్లాడుతూ కులంలో ఏమైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలి. కానీ ఇలా కుల బహిష్కరణ చేయొద్దన్నారు. గ్రామంలో మళ్లీ ఇలాంటి ఘటనలు జరగకుండా గ్రామస్థులు చూసుకోవాలని, లేకపోతే చట్టపరమైన చర్యలు ఉంటాయని సీఐ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో డీటీ కౌశిక, ఆర్ఐ దీక్షిత్, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ హేమతబేగం, ఏఈవో నరేందర్‌గౌడ్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

పోగొట్టుకున్న 80 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేసిన సీపీ



సీపీ బి.అనురాధ అందజేసిన ఫోన్లను చూపుతున్న బాధితులు

సిద్దిపేట క్రైం, సెప్టెంబరు 11: పట్టణంలో కొందరు జార విడుచుకున్న, దొంగతనానికి గురైన 80 సెల్‌ఫోన్లను సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా స్వాధీనం చేసుకుని బాధితులకు సిద్దిపేట పోలీస్ కమిషనర్ కార్యాలయంలో బుధవారం సీపీ బి.అనురాధ అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ.. సెల్‌ఫోన్ ఎక్కడ పడిపోయినా, ఎవరైనా దొంగిలించినా వెంటనే సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో నమోదు చేస్తే స్వాధీనం చేసుకునే అవకాశం ఉంటుందన్నారు. ఫోన్‌కు సంబంధించిన పూర్తి వివరాలతో ఫిర్యాదు చేయాలన్నారు. 2023 ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 1245 సెల్‌ఫోన్లు సీఈఐఆర్ టెక్నాలజీ ద్వారా గుర్తించి స్వాధీనం చేసుకుని బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా బాధితులు సీపీకి, పోలీసు అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

22 ఏళ్లు గడిచినా పూర్తి కాని నిర్మాణం!

- దుబ్బాకలో షాదీఖానా దుస్థితి ఇదీ
- ఇద్దరు ఎమ్మెల్యేలు రెండు చోట్ల పనులు
- రెండు అసంపూర్తిగానే..

దుబ్బాక, సెప్టెంబరు 11: నిరుపేద ముస్లింల వివాహాల కోసం నిర్మించతలపెట్టిన షాదీఖానా భవనం 22 ఏళ్ల నుంచి కలగానే మిగిలింది. ఇద్దరు ఎమ్మెల్యేల హయాంలో తమకు పేరు దక్కాలనే ఉద్దేశంతో చేసిన రాజకీయం చివరికీ షాదీఖానా నిర్మాణం పూర్తి కాకుండా పోయింది. ఇద్దరు ఎమ్మెల్యేలు రెండు చోట్ల నిర్మాణ పనులను చేపట్టి, అసంపూర్తిగా వదిలేయడంతో వాటిల్లో చెట్లు, పిచ్చి మొక్కలు మొలిచి, నిరుపయోగంగా మారాయి. దుబ్బాక పట్టణంలోని దుంపలపల్లి రోడ్డువైపు ఒకరు పనులు చేపట్టగా, బస్టాండ్ సమీపంలో మరొకరు పనులు ప్రారంభించి, చివరికీ రెండూ ప్రభుత్వాల మార్పిడి కారణంగా పనులు జరగకుండా నిలిచిపోయాయి. అప్పటి మంత్రి చెరుకు ముత్యంరెడ్డి రూ. 17 లక్షలతో జన్మభూమి కార్యక్రమంలో భాగంగా దుంపలపల్లి రహదారి పక్కన 2002 డిసెంబరు 12న ప్రారంభించిన పనులు 2004 వరకు కొనసాగాయి. అప్పటి ప్రభుత్వం మారడంతో నిధులు నిలిచిపోయాయి. 2009లో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ ఎమ్మెల్యేగా తిరిగి గెలుపొందిన చెరుకు ముత్యంరెడ్డి 2012లో రూ. 50లక్షలు అసంపూర్తి షాదీఖానా నిర్మాణానికి మంజూరు చేయించారు. అయితే ప్రహరీ లేదనే కారణంతో ప్రారంభించకుండానే వదిలేశారు. 2014లో చేపట్టిన పనులను ప్రభుత్వం మారడంతో సుమారు 56 లక్షలతో నిర్మించిన షాదీఖానాను వదిలేసి, అప్పటి ఎమ్మెల్యే రామలింగారెడ్డి మరో చోట షాదీఖానా నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. 2016లో బస్టాండ్ సమీపంలో స్థల సేకరణ చేపట్టి కోటీ రూపాయాలతో షాదీఖానా నిర్మాణ పనులు ప్రారంభించారు. దుబ్బాకకు అప్పటి సీఎం కేసీఆర్ వచ్చిన సందర్భంగా షాదీఖానాకు కోటి రూపాయాలు ప్రకటించారు. అక్కడ కూడా చేసిన పనులకు బిల్లులు రాలేదని, సుమారు 60 లక్షల పనులు పూర్తి చేసి చేతులెత్తేశారు. ఎనిమిదేళ్లపాటు సాగిన పనులకు బిల్లులు రాకపోవడంతో పనులు ఆగిపోయాయి. మళ్లీ ప్రభుత్వం మారడంతో ఇందుకు సంబంధించిన బిల్లులు రావడం కష్టంగా మారడంతో నిర్మాణ పనులను వదిలేశారు. ఇందులో కూడా చెట్లు, పిచ్చి మొక్కలు పెరిగి, నిరుపయోగంగా మారింది. రెండు చోట్ల నిర్మాణాలకు రెండు పర్యాయాలు నిధులు మంజూరు అయినా భవన నిర్మాణాలు పూర్తి కాకపోవడంతో 22 ఏళ్ల నుంచి వారికి షాదీఖానా భవనం కలగానే మిగిలింది. స్థల ఎంపికలో బాధ్యులు సక్రమంగా వ్యవహరించి ఉంటే, రెండు స్థలాల్లో లక్షలాది రూపాయాలు వెచ్చించి ఉండాల్సిన అవసరం ఉండేది కాదంటున్నారు.



నిరుపయోగంగానే మిగిలిన టీడీపీ, కాంగ్రెస్ హయాంలో నిర్మించిన షాదీఖానా



అసంపూర్తిగానే వదిలేసిన బీఆర్ఎస్ ప్రభుత్వంలో రెండోసారి నిర్మించిన షాదీఖానా

ఆగిఉన్న కారును ఢీకొట్టిన మరో కారు

కుకునూరుపల్లి, సెప్టెంబరు 11: ఆగి ఉన్న కారును అదుపు తప్పి మరో కారు ఢీకొట్టింది. ఈ సంఘటన మెదినిపూర్ రాజీవ్ రహదారిపై బుధవారం చోటుచేసుకున్నది. హైదరాబాద్ నుంచి కారులో మల్లికార్జునస్వామి దర్శనం కోసం వెళ్తుండగా మెదినిపూర్ వద్ద కారు అదుపుతప్పి రోడ్డుపై ఆగి ఉన్న మరో కారును ఢీకొట్టింది. దీంతో కారులో ప్రయాణిస్తున్న మల్లేశానికి తీవ్రగాయాలు కాగా మరో వ్యక్తికి స్వల్పంగా గాయాలయ్యాయి. వీరికి 108 సిబ్బంది ప్రథమ చికిత్స అందించి గజ్వేల్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

● **మద్దూరు:** ప్రమాదవశాత్తు కారు చెట్టును ఢీకొట్టిన ఘటనలో తృటిలో ప్రమాదం తప్పింది. మండలంలోని మర్మాముల నుంచి ధర్మారానికి వెళ్తున్న కారు గ్రామ శివారులో మూల మలుపు వద్ద అదుపుతప్పి చెట్టును ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు ముందు భాగంగా దెబ్బతింది. గ్రామస్థులు కారును పక్కకు తొలగించారు. డ్రైవింగ్ చేస్తున్న పీఆర్ ఏఈ సురక్షితంగా బయటపడ్డారు.

పార్టీ కోసం పనిచేసిన వారికి అవకాశాలు

- వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

ములుగు, సెప్టెంబరు 11: కష్టకాలంలో పార్టీ కోసం పనిచేసిన ప్రతీ కార్యకర్తకు సముచిత స్థానం కల్పిస్తామని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. హైదరాబాద్‌లో బుధవారం ములుగు మండలం కాంగ్రెస్ కార్యకర్తలు మంత్రి దామోదర్‌ను కలిశారు. వంటిమామిడి మార్కెట్ కమిటీ చైర్మన్ పదవిని ములుగు మండలానికి ఇచ్చే విధంగా కృషి చేయాలని వారు మంత్రి దృష్టికి తీసుకుపోగా కష్టకాలంలో పార్టీకి అండగా నిలిచిన వారికి పదవులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో శ్రీనివాస్ గుప్తా, శేఖర్‌గౌడ్, నరసింహారెడ్డి, నల్ల శ్రీనివాస్, కృష్ణ తదితరులు ఉన్నారు.

మా గ్రామానికి రోడ్డు వేయండి

- మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి వట్టిపల్లి నేతల విజ్ఞప్తి



మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో వట్టిపల్లి కాంగ్రెస్ నేతలు

జగదేవ్‌పూర్, సెప్టెంబరు 11: తమ గ్రామానికి రోడ్డు వేయాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి మండలంలోని వట్టిపల్లి గ్రామ కాంగ్రెస్ నేతలు విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర రోడ్డు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డిని హైదరాబాద్‌లోని తన నివాసంలో వట్టిపల్లి కాంగ్రెస్ మాజీ సర్పంచ్ రజిత రాజేందర్ రెడ్డి, పార్టీ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. వట్టిపల్లి నుంచి సాల్వాపూర్ వరకు డబుల్ రోడ్డు వేయించాలని, రోడ్డు సరిగ్గా లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని మంత్రికి వినతిపత్రం అందజేశారు. మంత్రి వెంటనే సానుకూలంగా స్పందించి అతి త్వరలోనే డబుల్‌రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ ఆనంద్



డెంగీతో మృతిచెందిన మహిళ ఇంటి వద్ద స్థానికులతో మాట్లాడుతున్న ఆనంద్

గజ్వేల్, సెప్టెంబరు 11: సీజనల్ వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో డాక్టర్ ఆనంద్ సూచించారు. గజ్వేల్ మండలం అహ్మదీపూర్ పీహెచ్‌సీని బుధవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రజలకు అందుతున్న సేవలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహిస్తున్న ఆరోగ్య కార్యక్రమాలపైన వైద్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. దోమల వృద్ధిని నివారించేందుకు ప్రతీరోజు డ్రైడేను పాటించాలని, ప్రజలకు కీటక జనిత వ్యాధులపైన అవగాహన కల్పించాలన్నారు. గ్రామంలోని ప్రజలతో మాట్లాడుతూ.. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపిస్తాయని, ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. అనంతరం గ్రామంలో డెంగీతో మృతిచెందిన మహిళ ఇంటి పరిసరాలను పరిశీలించి, వారితో మాట్లాడారు. ఆయనవెంట గజ్వేల్ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ శ్రీనివాస్, పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ ప్రణయ్‌రాజ్, వైద్య సిబ్బంది ఉన్నారు.

ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు ఉన్న పార్టీ బీజేపీ

- రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు లక్కిరెడ్డి తిరుమలరెడ్డి



కోహెడలో సభ్యత్వ నమోదు పత్రాన్ని అందజేస్తున్న రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు లక్కిరెడ్డి తిరుమలరెడ్డి

కోహెడ, సెప్టెంబరు 11: ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వంలో ప్రపంచంలోనే అత్యధిక సభ్యత్వాలు ఉన్న పార్టీగా బీజేపీ కొనసాగుతున్నదని ఆ పార్టీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు లక్కిరెడ్డి తిరుమలరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం బీజేపీ సభ్యత్వ నమోదును మండల అధ్యక్షుడు ఖమ్మం వేంకటేశంతో కలిసి ప్రారంభించి మొదటి సభ్యత్వాన్ని ఇంద్రసేనరెడ్డికి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా సభ్యత్వ నమోదు విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల ప్రధానకార్యాదర్శులు పిల్లి నర్సయ్య, జాలిగం రమేష్, సభ్యత్వ నమోదు మండల కో ఆర్డినేషన్ కన్వీనర్ మ్యాకాల రజినీకాంత్‌రెడ్డి, నాయకులు తదితరులున్నారు.

● **దుబ్బాక/మిరుదొడ్డి:** రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపేలక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని జిల్లా సభ్యత్వ ప్రభారి సుభాష్‌చందర్‌జీ సూచించారు. దుబ్బాక, మిరుదొడ్డి మండలకేంద్రాల్లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతీబూత్‌లో 200కు తగ్గకుండా సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు బాలేష్‌గౌడ్, జిల్లా ప్రధానకార్యదర్శి శ్రీనివాస్, జిల్లా సభ్యత్వ కన్వీనర్ బిక్షపతి, జిల్లా ఉపాధ్యక్షుడు రోశయ్య, మల్లేశం, మిరుదొడ్డి మండల అధ్యక్షుడు దేవరాజు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

● **హుస్నాబాద్:** హుస్నాబాద్ పట్టణంలో బీజేపీ సభ్యత్వ నమోదును ప్రారంభించారు. కార్యక్రమంలో సభ్యత్వ కో కన్వీనర్ లక్కిరెడ్డి తిరుమల, బీజేపీ పట్టణ అధ్యక్షుడు దొడ్డి శ్రీనివాస్, చిట్టి గోపాల్‌రెడ్డి, సభ్యత్వ ఇన్‌చార్జి పల్లెని వేణుగోపాల్ రావు, బుర్ర రాజు, దొంతరవేని సాంబరాజు, తోట స్వరూప, చందు, విద్యాసాగర్ తదితరులున్నారు.

వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలి

- మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు



నిమజ్జనానికి తరలుతున్న గణపతికి దిష్టి తీస్తున్న హరీశ్‌రావు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 11: వినాయకుడి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆకాంక్షించారు. వినాయక నవరాత్రుల సందర్భంగా పట్టణంలో ఏర్పాటు చేసిన గణనాథులను బుధవారం ఆయన దర్శించుకున్నారు. పట్టణంలోని హౌజింగ్ బోర్డు వద్ద స్నేహమిత్ర యూత్ అసోసియేషన్, లాల్ కమాన్ వద్ద వాసవీ యూత్, పటేల్‌పుర లోని పార్వతిమాత ఫ్యామిలి యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాలను సందర్శించారు. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు హరీశ్ రావుకు తీర్థ ప్రసాదాలు అందజేసి ఆశీర్వదించారు.

● **దుబ్బాక:** అన్నదానం మహాదానమని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు కత్తి కార్తీకగౌడ్ అన్నారు. దుబ్బాకలో కార్తీక ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఏర్పాటు చేసిన వినాయకుడి వద్ద మున్సిపల్ చైర్‌పర్సన్ వనితాభూంరెడ్డి పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులున్నారు.

● **మర్కుక్:** మండలంలోని పాములపర్తి రామాలయంలో 10 సంవత్సరాల నుంచి మట్టి గణపతిని ప్రతిష్ఠిస్తున్న ఆలయ వ్యవస్థాపకులు హరిపంతులును బుధవారం రామకోటి సంస్థ అధ్యక్షుడు రామకోటి రామరాజు సన్మానించారు. కార్యక్రమంలో భక్త బృందం సభ్యులు పాల్గొన్నారు.

లైట్‌మోటార్ డ్రైవర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

చేర్యాల, సెప్టెంబరు 11: చేర్యాల పట్టణ లైట్ మోటార్ డ్రైవర్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నిక బుధవారం జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా ఆడెపు మహేశ్, అధ్యక్షుడిగా మహేందర్, ఉపాధ్యక్షులుగా సాతెల్లి దేవయ్య, మాచర్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా యాట కనకయ్య సలహాదారుడిగా పాక బాలయ్య, కోశాధికారిగా పసుల సంతు, సహాయ కార్యదర్శులుగా ఎండీ. మాలిక్, పాక శ్రీనివాస్, సలహాసభ్యులుగా ఎండీ. భాషమియా, కర్నె కర్ణాకర్, శివ, శ్రీరాం రమేశ్, ముస్త్యాల మహేందర్, భాస్కర్, నుజ్జు ఎన్నికయ్యారు.

పేదలకు అండగా ప్రభుత్వం

దూళిమిట్ట, సెప్టెంబరు 11: నిరుపేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం నిలుస్తున్నదని నాగపురి కిరణ్‌కుమార్ గౌడ్ అన్నారు. మండలంలోని బైరాన్‌పల్లి, కూటిగల్, బెక్కల్ గ్రామాల్లో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను బుధవారం ఆయా గ్రామాల కాంగ్రెస్ నాయకులతో కలిసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు, ఆయా గ్రామశాఖ అధ్యక్షులు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఎంసీ వైస్ చైర్మన్‌కు సన్మానం

గజ్వేల్, సెప్టెంబరు 11: గజ్వేల్ ఏఎంసీ వైస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన సర్దార్‌ఖాన్‌ను చిన్ననాటి మిత్రులు శాలువాతో సత్కరించారు. ప్రజ్ఞాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్ పదోతరగతి మిత్రులు ఆయనను ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో రామరాజు, రవీందర్, కనకరాజు, శ్రీనివాస్, కృష్ణ, స్వామి తదితరులున్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో జరిమానా

గజ్వేల్, సెప్టెంబరు 11: డ్రంకన్ డ్రైవ్‌లో పట్టుబడిన 15మందికి రూ.30వేల జరిమానా విధిస్తూ గజ్వేల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ ప్రియాంక తీర్పు వెలువరించినట్లు గజ్వేల్ ట్రాఫిక్ సీఐ మురళీ తెలిపారు. పట్టణంలోని ఆయా చౌరస్తాలలో నిర్వహించిన డ్రంకన్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడిన వారికి పైవిధంగా మెజిస్ట్రేట్ జరిమానా విధించినట్లు చెప్పారు.

ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలి: డీఐఈవో రవీందర్‌రెడ్డి



సిద్దిపేట కల్చరల్: మాట్లాడుతున్న రవీందర్‌రెడ్డి

బెజ్జంకి, సెప్టెంబరు 11: ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదువుతున్న విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించేలా లెక్చరర్లు కృషి చేయాలని డీఐఈవో కె.రవీందర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను ఆయన బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించి మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో అడ్మిషన్ల సంఖ్య పెంచాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ దేవస్వామి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి ప్రవీణ్‌రెడ్డి, అధ్యాపకులు తదితరుల ఉన్నారు.

● **సిద్దిపేట కల్చరల్:** ఉన్నతమైన లక్ష్యాలను నిర్దేశించుకుని, వాటిని సాధించేందుకు నిరంతరం కష్టపడాలని డీఐఈవో రవీందర్‌రెడ్డి సూచించారు. సిద్దిపేట ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల బుధవారం నిర్వహించిన ఫ్రెషర్స్‌డే వేడుకలకు హాజరై విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ రాణి, అధ్యాపకులు వనజ, రమాదేవి, వందన, రూప, శారద, శ్రీనివాస్, లక్ష్మి, ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ కృష్ణారావు, జూనియర్ అసిస్టెంట్ రామారావు విద్యార్థులు పాల్గొన్నారు.

'పత్తిలో ఎండు తెగులు నివారణకు చర్యలు చేపట్టాలి'

రాయపోల్, సెప్టెంబరు 11: పత్తి పంటను ఎండుతెగులు ఆశిస్తున్నదని, దాని నివారణకు చర్యలు చేపట్టాలని గజ్వేల్ ఏడీఏ బాబూనాయక్ పేర్కొన్నారు. మండల వ్యవసాయాధికారి నరేష్‌తో కలిసి బుధవారం రాయపోల్‌లో పత్తి, మొక్కజొన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల కురిసిన వర్షాల వల్ల పత్తిచేలకు ఎండు తెగులు వచ్చే అవకాశం ఉన్నదన్నారు. పత్తి పంటలో ఎండు తెగులు గమనిస్తే నివారణ కోసం కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటరు నీటికి 3 గ్రాముల చొప్పున కలిపి పత్తి పంట మొదలు తడిచే విధంగా డ్రెంచింగ్ చెయ్యాలని సూచించారు. వారివెంట ఏఈవో రజిత ఉన్నారు.

ఆయిల్‌పామ్ సాగుతో లాభం

- మండల వ్యవసాయ అధికారి నాగేందర్‌రెడ్డి



ఆయిల్‌పామ్ మొక్కలను పరిశీలిస్తున్న నాగేందర్‌రెడ్డి

మర్కుక్, సెప్టెంబరు 11: ఆయిల్‌పామ్ సాగుతో రైతులకు ఎంతో లాభం అని మండల వ్యవసాయ అధికారి నాగేందర్ రెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ఎర్రవల్లిలో మిట్టపల్లి రాజిరెడ్డి ఆయిల్‌పామ్ క్షేత్రంలో పరపరాగ సంపర్కానికి ఉపయోగపడే పురుగులను బుధవారం వదిలినట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక ఎకర వరి సాగుకు అవసరమైయ్యే నీటితో 4 ఎకరాల ఆయిల్‌పామ్ సాగు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో ఉద్యాన అధికారి సౌమ్య వ్యవసాయ విస్తరణ అధికారులు విష్ణువర్ధన్, రజినీకాంత్, విజయ్, రైతులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండస్వామి

గజ్వేల్, సెప్టెంబరు 11: పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని డీబీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి దాసరి ఏగొండ స్వామి డిమాండ్ చేశారు. గజ్వేల్ పట్టణంలోని రైతువేదిక వద్ద బుధవారం వ్యవసాయశాఖ ఏడీ బాబునాయక్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. గజ్వేల్ డివిజన్ పరిధిలో నల్లరేగడి భూముల్లో సాగు చేసిన పత్తి పంటలో వర్షం నీరు నిలిచి పంట పూర్తిగా ఎర్రబడి పోయి, మొక్కలు ఎండిపోతున్నాయన్నారు. అధికారిక లెక్కల ప్రకారం 5366 ఎకరాల్లో వరి, 1762 ఎకరాల్లో పత్తి, 271 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం జరిగిందని అంచనా వేశారన్నారు. ఆయనవెంట రైతులు మల్లేశం, రాములు ఉన్నారు.

ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి 'పీఆర్టీయూ' కృషి

- జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ

కోహెడ, సెప్టెంబరు 11: ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న ఏకైక సంఘం పీఆర్టీయూ అని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు శశిధర్‌శర్మ అన్నారు. పీఆర్టీయూ మండలశాఖ అధ్యక్షుడు దర్శనాల నారాయణ అధ్యక్షతన బుధవారం కోహెడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి పీఆర్టీయూ కృషి చేస్తున్నదని, ఉపాధ్యాయులంతా సంఘానికి అండగా నిలవాలని కోరారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారిగా ఎడబోయిన మల్లారెడ్డి వ్యవహరించారు. మండలశాఖ నూతన అధ్యక్షుడిగా అన్నాడి మహేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా దర్శనాల నారాయణ, అసోసియేట్ అధ్యక్షుడిగా ఏ. లింగారెడ్డి, మహిళా అధ్యక్షురాలుగా పి. లక్ష్మి, కార్యదర్శులుగా ఎన్. కనకయ్య, విజయలక్ష్మి ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శులు ఇంద్రసేనారెడ్డి, జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి పంతం వెంకట్రాజ్యం, అక్కన్నపేట మండల అధ్యక్షుడు కిషన్‌నాయక్, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ముత్యాల సురేందర్‌రెడ్డి, దుబ్బాక బాల్‌రెడ్డి, పద్మ, అనిత, జిల్లా కార్యదర్శి దామోదర్, గజ్వేల్ మండలశాఖ అధ్యక్షుడు ఊడెం వేమారెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రమణ, సద్గుణాచారి తదితరులున్నారు.

ఎస్జీటీలకు ఎమ్మెల్సీ ఓటుహక్కు కల్పించాలి

మర్కుక్, సెప్టెంబరు 11: ఎస్జీటీలకు ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని ఎస్జీటీయూ జిల్లా నాయకుడు శ్రీధర్‌రెడ్డి, గజ్వేల్ మండల అధ్యక్షుడు రవికుమార్ డిమాండ్ చేశారు. మండల పరిధిలోని పాములపర్తి ప్రాథమిక పాఠశాలలో నిర్వహిచిన మండల ఎస్జీటీల సమావేశానికి వారు ముఖ్య అతిథులుగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా మర్కుక్ మండల నూతన అధ్యక్షుడిగా ముత్తయ్య, ప్రధాన కార్యదర్శిగా కమలాకర్‌రెడ్డి, కోశాధికారిగా రామచంద్రయ్య, ఉపాధ్యక్షులుగా హేమలత, శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శులుగా స్వప్న, విజయకుమారి ఎన్నికయ్యారు.



మర్కుక్: నియామకపత్రం అందుకుంటున్న నూతన కార్యవర్గం సభ్యులు

చేర్యాలలో సామూహిక కుంకుమార్చన



సామూహిక కుంకుమార్చన చేస్తున్న మహిళలు

చేర్యాల, సెప్టెంబరు 11: వినాయక నవరాత్రోత్సవాలను పురస్కరించుకుని చేర్యాల పట్టణంలోని భరత్‌నగర్‌కాలనీలో బ్రిల్లియంట్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం గణపతి హోమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గణపతిని స్తుతిస్తూ హోమం నిర్వహించారు. అనంతరం చేపట్టిన సామూహిక కుంకుమార్చనలో మహిళలు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

రాష్ట్రీయ మహా పోషణ కార్యక్రమం

వర్గల్, సెప్టెంబరు 11: మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం రాష్ట్రీయ మహాపోషణ 2024లో భాగంగా పిల్లలకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. వారిలో ముగ్గురిని ఎన్ఆర్‌సీ కోసం సిద్దిపేటకు రిఫర్ చేసినట్లు మండల వైద్యాధికారి హరిత తెలిపారు. కార్యక్రమంలో ప్రత్యేకాధికారి కవిత, ఎంపీడీవో విజయలక్ష్మి, వైద్యాధికారి మీన, ఏపీవో ఆనంద్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'అస్తవ్యస్తంగా పారిశుధ్య నిర్వహణ'

హుస్నాబాద్, సెప్టెంబరు 11: హుస్నాబాద్ పట్టణంలో పారిశుధ్య పనులు అస్తవ్యస్తంగా మారాయని బీఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి అయిలేని మల్లికార్జున్‌రెడ్డి ఆరోపించారు. హుస్నాబాద్ పట్టణంలో పలువురు జ్వర బాధితులను బుధవారం ఆయన పరామర్శించి అనంతరం విలేకరులతో మాట్లాడారు. పట్టణంలోని జ్యోతినగర్‌లో పారిశుధ్య పనులు పడకేశాయని, కాలనీలో డ్రైనేజీ నీరు రోడ్డుమీదకు వచ్చి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు.



గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని సెయింట్ మేరీస్ విద్యానికేతన్ హైస్కూల్‌లో విద్యార్థులు వినాయకుడిని ఘనంగా నిమజ్జనం చేశారు. నిమజ్జనంలో ప్రిన్సిపాల్ విజయపాల్‌రెడ్డి, కాటరాయప్ప, ఉపాధ్యాయులు ఉన్నారు. - గజ్వేల్

రోడ్డుపై స్టాపర్స్ ఏర్పాటు చేయండి

- ఏసీపీని కోరిన పాఠశాల ప్రధానోపాధ్యాయుడు

గజ్వేల్, సెప్టెంబరు 11: గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్ల ప్రాథమిక పాఠశాల వద్ద రోడ్డుపై స్టాపర్స్‌ను ఏర్పాటు చేయాలని గజ్వేల్ ఏసీపీ కె.పురుషోత్తంరెడ్డిని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మదునాల శ్రీనివాస్ కోరారు. గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ఏసీపీ కార్యాలయంలో బుధవారం ఆయనను మర్యాదపూర్వంగా కలసి యోగామృతం పుస్తకాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ.. రేపటిలోగా పనులు ప్రారంభమవుతాయని హామీ ఇచ్చినట్లు ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్ తెలిపారు.

శౌర్యయాత్రను జయప్రదం చేయాలి

- సీపీఎం కొమురవెల్లి మండల కార్యదర్శి సత్తిరెడ్డి



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

చేర్యాల, సెప్టెంబరు 11: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరవీరుల సంస్మరణ వారోత్సవాలను పురస్కరించుకుని ఈనెల 14న చేర్యాల నుంచి బైరాన్‌పల్లివరకు చేపట్టనున్న శౌర్యయాత్ర నుజయప్రదం చేయాలని సీపీఎం కొమురవెల్లి మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి కోరారు. కొమురవెల్లి మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శౌర్యయాత్ర కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

'విశ్వకర్మ యజ్ఞ మహోత్సవానికి రండి'

గజ్వేల్, సెప్టెంబరు 11: ఈ నెల 17న గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని మల్లన్నసాగర్ ఆర్అండ్ఆర్ కాలనీలో నిర్వహించే శ్రీవిరాట్ విశ్వకర్మ యజ్ఞ మహోత్సవానికి రావాలని మున్సిపల్ చైర్మన్ ఎన్‌సీ రాజమౌళికి ఆ సంఘం నాయకులు బుధవారం ఆహ్వానపత్రికను అందజేశారు. కార్యక్రమంలో విశ్వకర్మ మనుమయ సంఘం అధ్యక్షుడు గడియారం వెంకటాచారి, ప్రధాన కార్యదర్శి విఠల్‌చారి, ఉపాధ్యక్షుడు గడియారం వెంకటేశంచారి, సహాయ కార్యదర్శి స్వామిచారి, పల్లెపహాడ్ మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌చారి తదితరులు పాల్గొన్నారు.

మహిళా సభ్యులకు పెరటి కోళ్ల పంపిణీ

కొండపాక, సెప్టెంబరు 11: మండల మహిళా సమైక్య ఆధ్వర్యంలో గ్రామ సంఘాల్లోని మహిళా సభ్యులకు పెరటి కోళ్లను దుద్దెడలో బుధవారం ఎంపీడీవో వెంకటేశ్వర్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మగ్దుం అలీ, సీసీలు, పంచాయతీ కార్యదర్శి తదితరులున్నారు.

ఎమ్మెల్యేలను చేర్చుకున్నపుడు గుర్తు రాలేదా?

- కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ నర్సింహారెడ్డి

సిద్దిపేట కలెక్టరేట్, సెప్టెంబరు 11: కాంగ్రెస్ ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకున్న బీఆర్ఎస్ నాయకులు ఇప్పుడు పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ కిసాన్ సెల్ రాష్ట్ర కో-కన్వీనర్ నరసింహారెడ్డి, టీపీసీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు, కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డిలు విమర్శించారు. సిద్దిపేట ప్రెస్‌క్లబ్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. రెండు లక్షలపైన రుణం ఉన్న రైతులకు, రేషన్‌కార్డు లేని రైతులకు కూడా త్వరలోనే రుణమాఫీ అవుతుందన్నారు. పార్టీ ఫిరాయింపుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్ ఎమ్మెల్యేలకు లేదన్నారు. కాంగ్రెస్ కిసాన్ సిద్దిపేట జిల్లా కార్యదర్శులుగా భూపతిరెడ్డి, కరుణాకర్‌లను నియమిస్తూ కిసాన్ సెల్ నాయకులు నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కిసాన్ సెల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కులతో కాంగ్రెస్ రాజకీయం

ములుగు, సెప్టెంబరు 11: కల్యాణలక్ష్మి చెక్కులతో కాంగ్రెస్ నాయకులు రాజకీయాలు చేయడం సరికాదని ఉమ్మడి మెదక్ జిల్లా డీసీసీబీ డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి విమర్శించారు. ములుగులో బుధవారం ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వచ్చి ఎనిమిది నెలలు గడుస్తున్నదని, ఇప్పటికే కల్యాణలక్ష్మి చెక్కులు వచ్చి ఆర్డీవో ఆఫీస్‌లో ఉన్నప్పటికీ నాయకులు రాజకీయాల పేరుతో పేద ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారన్నారు. అప్పులు చేసి పెళ్లి చేసిన పేదలకు ప్రభుత్వం ఇస్తున్న చెక్కులను దాచుకోవడం ఎంతవరకు సమంజసమన్నారు. ఆయనవెంట మాజీ ఎంపీటీసీ హరిబాబు, కరుణాకర్‌రెడ్డి, శేఖర్, రాజు, చందు, సురేష్‌తో పాటు తదితరులు ఉన్నారు.

డౌన్ మెరిట్ విధానంలో ఉద్యోగాలు భర్తీ చేయాలి

- బల్మూరి వెంకట్‌ను కోరిన గ్రూప్ 4 అభ్యర్థులు

సిద్దిపేట కల్చరల్, సెప్టెంబర్ 11: బ్యాక్‌లాగ్ పద్ధతిలో కాకుండా డౌన్ మెరిట్ విధానంలో ఉద్యోగాలు భర్తీ చేయాలని గ్రూప్4 మెరిట్ లిస్టులో సెలక్టయిన సిద్దిపేట జిల్లాకు చెందిన అభ్యర్థులు ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్‌కు వినతిపత్రం అందజేశారు. అభ్యర్థులకు అన్‌విల్లింగ్ ఆప్షన్ ఇవ్వాలని, లేదంటే 3 వేల పోస్టులు బ్యాక్‌లాగ్ అవుతాయన్నారు.

'సమాజంలో క్షీణిస్తున్న నైతిక విలువలు'



అస్రా ముహ్సినా

సిద్దిపేట టౌన్, సెప్టెంబరు11: సమాజంలో నైతిక విలువలు క్షీణిస్తున్నాయని, నైతిక సంక్షోభం సమాజంలో అశాంతి, అలజడులకు కారణమవుతున్నదని జమాఅతె ఇస్లామీ హింద్ సంస్థ సిద్దిపేట జిల్లా ఉమెన్స్ వింగ్ ప్రతినిధి అస్రా ముహ్సినా బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ పరిస్థితిని రూపుమాపడానికి జమాఅతె ఇస్లామీ హింద్ నైతిక విలువల ప్రచార ఉద్యమాన్ని చేపట్టినట్లు, విలువల ప్రాచుర్యం కోసం నైతిక సమాజమే న్యాయమైన సమాజం అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహిస్తునట్లు పేర్కొన్నారు. తెలుగు, ఇంగ్లిష్ భాషల్లో జరిగే ఈ పోటీల్లో 18 నుంచి 30 ఏళ్లలోపు యువతులు పాల్గొనవచ్చని తెలిపారు. వివరాలకు 9515478080 నెంబరుకు సంప్రదించాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి: చేర్యాల సీఐ

మద్దూరు, సెప్టెంబరు 11: ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని చేర్యాల సీఐ ఎల్. శ్రీను సూచించారు. స్థానిక పోలీసుస్టేషన్‌లో బుధవారం ఆటో డ్రైవర్లతో అవగాహన కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఆటోల్లో ప్రయాణించే వారితో అసభ్యంగా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రతీ డ్రైవర్‌కు లైసెన్స్ తప్పని సరిగా ఉండాలన్నారు. త్వరలో అందరికీ అభయ యాప్ స్టిక్కర్ అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఐ షేక్ మహబూబ్, ఏఎస్ఐ జగదీశ్వర్, సిబ్బంది, ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.